కథా నిలయం
3912
శ్రీకాకుళం

# సుబ్బి

మద్రాసు మహానగరంలో సెంట్రల్ స్టేషను ఎదుటి బస్ స్టాపు.

'కాసేపుంటే పదిమాటలు పలుకుతాను' అంటున్నది సెంట్రల్‌మీది గడియారం.

మైలాపూరువైపు వెళ్ళాల్సిన ప్రజలందరూ బుద్ధిమంతుల్లా వరసగా నుంచున్నారు.

ఆ వరసలో మధ్యవున్న ముసలాయన 'వెధవ గవర్నమెంటు బస్సులు వేళకి వచ్చిచావవు. వచ్చినా తిన్నగా నడిచిచావవు' అని అలవాటు చొప్పున ఆ రోజుకి ఆరోసారిగా అనుకున్నాడు. ఆయన నెత్తిమీద గొడుగువుంది.

ఆయన కవతల కొంతదూరంలో ఒకమ్మాయి నిలబడి వున్నది 'క్యూ'లో. పాతికేళ్ళలోపు వయసు. సైకాలజీ బి. ఏ. చదువుతోందిట. సైకాలజీ వాల్యూమ్‌ను సర్వప్రజలకూ తెలిసేలా పట్టుకునిల్చుంది. ఆమెను చూస్తే ఆమెలో సైకాలజీ తప్ప ఇంకేమీ వున్నట్టులేదు.

రోడ్డు అవతలివైపునుండి ఒకామె వచ్చింది. నల్లటిమేను. ముతక చీరె. మోచేతిదాక రవిక. నోట్లో తాంబూలం. చేతిమీద అంగుళంమందాన బంగారుగాజులు. కాళ్ళకి వెండిగొలుసులు. వయసు ముప్ఫయి కవతల.

ఆమె మదరాసు విజయం చేయడం ఇదే మొదటిసారి. ఆమె చంకను ఒక చిన్న అబ్బాయివున్నాడు. ఆమెను సుబ్బమ్మ అనుకోవచ్చు. సుబ్బీ అని పిలిచినా మరోలా అనుకునే రకంకాదు.

సుబ్బి సైకాలజీ యువతి పక్కగా నిల్చోబోయింది.

"ఛా ఛా....అదేవిటీ అందరూ వరాసగా నుంచుంటే మధ్యను దూరుతావేం? కొసకి వెళ్ళు" అని చీదరించుకుంది. సైకాలజీ కాసేపట్లో దోకొస్తుందేమో అని భయపడినట్లుంది. రెండునిమిషాలు ఆమెవైపు చూసి అవతలికి నడిచింది సుబ్బి. 'క్యూ' చివరకి వెళ్ళింది.

'క్యూ' కొసను ఒకావిడవుంది. తెల్ల ఖద్దరు చీరకట్టి, నొసటను కుంకుమబొట్టు దిద్దుకునివుంది. విశాలమయిన మొహం. కళ్ళజోడుకూడా వుంది. ఆమె ఎడమచేతి నంటిపెట్టుకుని ఐదేళ్ళఅమ్మాయివుంది. పట్టు పావడా గౌనూ వేసుకుని భరతనాట్యం వచ్చినదానిలా వుందా అమ్మాయి. కళ్ళజోడావిడచేతిలో ఫైళ్ళూ అవీ చూస్తే ఆదర్శసాంఘిక సేవాపరాయణు రాలులా వుంది.

సుబ్బి ఆమె ప్రక్కనిల్చుంది. ఆదర్శమహిళ అటూ ఇటూ పోతున్న మోటారుకార్ల వైపు చూస్తూంది తెలిసిన వారెవరయినా కారాపి, అందులో ఎక్కమనరా—అని కాబోలు. పక్కకు తిరిగిచూచి ప్లేగువ్యాధిని చూచినట్లు అదిరిపడి "ఏమేవ్" అంది.

సుబ్బి సెంట్రలుస్టేషన్ను చూచి 'ఆహా' అనుకుంటూంది.

"నిన్నే" అంది ఆదర్శమహిళ. సుబ్బి తిరిగింది.

"కళ్ళులేవూ?"

సుబ్బికి ప్రశ్న అర్థంకాలేదు. కాని తన చెంపలకున్న చేరెడేసి కళ్ళను ఇంకా వెడల్పుచేసి చూచింది. ఆదర్శమహిళ సులోచనాలను సరి చేసుకుంది. "అట్లా మీదకొచ్చి పడకపోతే కాస్తాదూరంగా నిల్చుకో లేవూ?" అంది.

సుబ్బి పిల్లాణ్ణి ఈ చంకలోకి మార్చుకుని కాస్త జరిగి నిల్చుంది.

మైలాపూరు బస్ మలుపు తిరిగింది.

ముసలాయన గొడుగును మడిచాడు.

సైకాలజీ యువతి పుస్తకాన్ని సర్దుకుంది.

ఆదర్శమహిళ అమ్మాయిని దగ్గరకి లాక్కుంది.

సుబ్బి అలాగే నిల్చుని వున్నది.

బస్‌వచ్చి స్టాపుదగ్గర ఆగింది. 'ఝామ్మ' ఎగిరి పోయింది. బస్‌దగ్గర ప్రజలందరూ బెల్లంమీద ఈగల్లా చుట్టుకున్నారు.

బస్ కిటికీకి ముసలాయన గొడుగు తగులుకుంది.

సైకాలజీ వాల్యూము ఒక అనీమియా కుర్రాది నెత్తిన ఒక వరస పలికింది.

ఆదర్శమహిళ కళ్ళజోడు 'ఉందునా పోనా' అంది ఒక్కసారి.

సుబ్బికీ బస్సుకూ ఎంతోదూరం వుంది. 'మరి వీళ్ళందరూ ఇంత సేపూ వరసగా నిల్చున్నారే' అని విస్తుపోయింది పల్లెటూరు జంతువు సుబ్బి.

బస్సులోకి అందరూ ఎక్కారు. ఇంకా ఖాళీవుంది. కండక్టరు సుబ్బికేసిచూసి "ఎక్కడికీ?" అన్నాడు.

"మయిలాపురం."

బసెక్కమన్నాడు కండక్టరు. అలాగే చేసింది సుబ్బి.

ఆడవాళ్ళకని ప్రత్యేకించిన ఆఖరివరసలో సుబ్బిని కూచోపెట్టాడు కండక్టరు.

ఆ వరసలోనే వున్న సైకాలజీ, ఆదర్శమూ ఒకరి మొహాలొకరు చూచుకున్నారు.

'ప్రిమిటీవ్ టైప్' అన్నాయి సైకాలజీ యువతి చూపులు.

'శుద్ధనాటుసరుకు' అన్నాయి ఆదర్శమహిళ కళ్ళు.

బస్సు కదిలింది. కండక్టరు టిక్కట్లిస్తున్నాడు ఐలండ్ గ్రవుండ్స్ దగ్గర ఆగింది బస్సు. కండక్టరు ఆఖరి వరసని సమీపించాడు.

ఆదర్శమహిళ రూపాయనోటిచ్చి "అజంతాస్టాప్" అంది కండక్టర్‌తో.

"ఎన్ని?" అన్నాడు కండక్టర్ ఆమె ప్రక్కనున్న అమ్మాయిని చూస్తూ.

"ఒకటి" అంది ఆమె.

"అమ్మాయికో?"

"అమ్మాయి కెందుకూ?"

"మూడేళ్ళుదాటితే టిక్కట్టు కొనాల్సిందే" అన్నాడు కండక్టరు. ఆమె అంది: "మా అమ్మాయి కింకా మూడోఏడు రాలేదు."

"అమ్మా! నిన్ననే నాకు ఐదోఏడు వచ్చిందంటివే?" అంది అమ్మాయి వెంటనే.

"ఛ! వెధవముండ! నోరుమూసుకో" అని గద్దించింది తల్లి. సైకాలజీ కిటికీ బయటకుచూచింది. కండక్టరు చిరునవ్వుతో టిక్కట్టునూ చిల్లరనూ ఇచ్చి "టికెట్ ఇన్‌స్పెక్టరొచ్చి అడిగితే అమాటే చెప్పండి" అన్నాడు.

"నాకు తెలుసు" అంది ఆదర్శమహిళ ఆగ్రహంతో, సైకాలజీ చేత ఇచ్చి ఓడియాన్ థియేటర్‌కు పుచ్చుకుంది ఒక్కటిక్కట్టు.

కండక్టరు సుబ్బి దగ్గరకొచ్చాడు. "మయిలాపురానికేనా....మూడణాలు" అన్నాడు. సుబ్బిముడివిప్పి కానీలూ అర్థణాలూ కలిపి మూడణాలిచ్చింది. కండక్టర్ ఒక్కటిక్కట్టు ఇచ్చాడు.

సుబ్బి ఒళ్ళోవున్న కుర్రాడిని చూచి "అబ్బాయి వయసెంత?" అన్నాడు.

"ఆ—?"

"అబ్బాయి పుట్టి ఎన్ని సంవత్సరాలయ్యింది?"

"మా అబ్బాయా....మా మావయ్య మిలిట్రీనుండి తిరిగొచ్చిన సంవత్సరం పుట్టాడు" అంది సుబ్బి బుర్రగోక్కుంటూ.

కండక్టరు ఓపికతో "అదికాదమ్మా.... అబ్బాయి కెన్నేళ్ళు....?" అని అడిగాడు.

"అదేమో నాకు తెలవదు...." అంది సుబ్బి నిస్సహాయంగా నవ్వుతూ.

"రెండేళ్ళుంటాయా....?"

"ఊ" అని బుర్రవూపింది సుబ్బి.

"....లేక మూడేళ్ళుంటాయా?"

ఇందుకుకూడా "ఊ" అంది సుబ్బి.

కండక్టరు మళ్ళీ అడిగాడు: "....సరిగ్గా చెప్పమ్మా. అబ్బాయి వయసు రెండుసంవత్సరాలా మూడు సంవత్సరాలా?" సుబ్బికేమీ అంతు చిక్కలేదు పాపం "అదెంతోనయ్యా, మీరే వేసుకోండి" అంది.

కండక్టరు నవ్వాడు. "అలా కాదమ్మా. అబ్బాయి వయసు మూడుదాటితే మూడణాలిచ్చి ఇంకో టిక్కట్టుకొనాలి. మూడేళ్ళకన్న తక్కువయితే కొనక్కర్లేదు. అందుచేత అబ్బాయి కెన్నేళ్ళు అని ఎవరన్నా అడిగితే, రెండేళ్ళు అని చెప్పు తెలిసిందా?" అని బోధించాడు.

సుబ్బి నోరు తెరుచుకు చూస్తున్నది.

"ఏవమ్మోయ్! ఆ తర్వాత ఇన్‌స్పెక్టరొచ్చి 'చెక్' చేస్తే నువ్వు మరోటి చెప్పేవు!! నా కొంపకూలగలదు" అని ఈలవేశాడు.

బస్సు కదిలింది. రౌండ్ ఠాణా, ప్లాజా, మిడ్‌లాండ్, దాటింది. ఓడియన్ వచ్చింది, పోయింది. ఆ తర్వాతి స్టాపులో బస్సు ఆగింది.

కండక్టరు సైకాలజీ అమ్మాయివైపు చూచి ఇలాఅన్నాడు. "మీరు ఓడియన్ టిక్కట్టుకొన్నారు బేడపెట్టి.... ఇంకా దిగలేదేం?"

ఎండిపోయిన చిరునవ్వుతో "ఐ యామ్‌సారీ" అంటూ దిగబోయి వట్టి లేచింది మూర్తీభవించిన సైకాలజీ.

"ఓడియన్ స్టాపుదాకా అయితే బేడ టిక్కట్టు సరిపోతుంది. ఇక్కడికయితే బేడాఅర్ధణా.... ఇప్పుడు అణా ఇచ్చి టిక్కట్టుకొనండి." అన్నాడు దారిలో నిల్చున్న కండక్టరు."

"మర్చిపోయానని చెబుతుంటినిగా!" అంది 'నరుడా! ఏమికావలె?' అన్న ధోరణిలో.

"అప్పే వీల్లేదు."

"కండక్టర్! ఆ అమ్మాయిని దిగనియ్యి" ఆదర్శమహిళ సపోర్టు.

"అవేం వుడకవు. అణా టిక్కట్టుకొని గాని దిగడానికివీల్లేదు." అన్నాడు కండక్టరు.

ఒక్కసారి మూడోకన్ను తెరిచి ఆ తర్వాత చేతిలోవున్న ఎరుకల బుట్టలాటి దానిని తెరిచి, చెల్లీ చెల్లని అణాకాసను విసిరికొట్టి చరచరా దిగిపోయింది ఉగ్రమూర్తియైన సైకాలజీ యువతి. కండక్టరు ఒక్కఅణా టిక్కట్టు చించి గాలిలో వదిలాడు. ఆదర్శమహిళవైపు చూచాడు. ఆమె మొహం తిప్పుకుంది 'బ్రూట్' అనుకుంటూ.

ఆ తర్వాత స్టాపు దగ్గర ఎవ్వరూ ఎక్కాలేదు. దిగాలేదు.

సుబ్బికి తాను చెప్పిన పాఠాన్ని పరీక్షిద్దామని కండక్టరు వెనక్కొచ్చాడు.

"ఏవమ్మా! అబ్బాయి వయసెంతా?"

"నాకు తెలవదయ్యా"

"రెండేళ్ళని చెప్పమంటినే...."

"అదేంటో బాబూ, గుర్తుండి సావదు...."

"అయితే లాభంలేదు మరి.....అబ్బాయి వయసెంతా అంటే నిక్కచ్చిగా రెండేళ్ళు అని చెప్పాలి. అలా చెప్పలేకపోతే మూడణాలిచ్చి టిక్కట్టుకొనాలి" అన్నాడు కండక్టరు.

"పోనీ నాకు మరో టిక్కట్టే ఇవ్వు బాబూ" అంటూ కొంగుముడి విప్పింది సుబ్బి.

కండక్టర్ మందహాసంతో మళ్ళీ ఆదర్శమహిళవైపు చూచాడు.

ఆమెకు ముళ్ళమీద కూచున్నట్లయి దిగాల్సిన స్టాపు రాకముందే అమ్మాయిని తీసుకుని దిగిపోయింది.

('ఆనందవాణి' డిసెంబర్ '౫౮)